

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 21 అక్టోబర్, 2024 సంచిక : 5

**సంస్థాపకులు :**
శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు
**సంస్థాపక సంపాదకత్వం :**
శ్రీ మాతా శుకవాణి
**ప్రధాన సంపాదకత్వం :**
శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ
**ప్రత్యేక సహకారం :**
డా॥ జి.చంద్రారెడ్డి M.A, M.Ed., Ph.D
శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)
శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)
**ప్రచార సారథ్యం :**
శ్రీ బి. గోపీకృష్ణ
శ్రీమతి బులుసు జయ

**సాయివాణి చందా వివరాలు**
2 సంవత్సరాలకు చందా.........రూ॥200/-
10 సం.రాలకు చందా........ రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
సాయిధామం, బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
Ph : 9440413455, 9848133565

Online Donations :
SRI SAI SEVA SAMITHI TRUST
A/c No.62002652136
SBI Keesara Branch,
IFSC Code : SBIN 0020639

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2
మరణంలో స్మరణ మహిమ ........ 5
జ్ఞానోదయమే జీవనసాఫల్యము ........ 7
సాయిభక్త దాసగణు ........ 10
శాశ్వత ధర్మగోప్త ........ 13
శ్రీ సాయి నిత్య పారాయణ ........ 16
బాబాపై భారం వేస్తే ........ 18
సాయిబాబా వారిని ఎందుకు ........ 20
మాతృసంస్థ కబుర్లు ........ 30
శ్రద్ధాంజలి ........ 32

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







## మా వాణి



ప్రియ పాఠకమిత్రులందరికీ,

విజయదశమి శుభాకాంక్షలు. గత గురువారంనాటి ఉదయం ఒక మిత్రుడు ఫోన్ చేసి "సాయి సచ్చరిత్రను గురించి ఒకరు నోటికి వచ్చినట్లు అవాకులూ, చెవాకులూ మాట్లాడారు. వారు పదిరకాల గ్రంథాలను గురించి ఉపన్యసించేవారూ, శాస్త్ర పాండిత్యం, పురాణాదికాలు, అవలోడనం చేసినవారూనూ. అందుచేత విన్నవారు ఆయన మాటలు శిలాక్షరాలుగా తీసుకొనే ప్రమాదమూ ఉంది. పైగా యివన్నీ గతంలో ఒక సాయి దేవాలయంలో వారం రోజుల ప్రవచనంలోనూ, ఆ తరువాత చెప్పినవి.

సాయి సచ్చరిత్ర వ్రాసిన వారూ, పారాయణ చేసిన వారు కూడా పాపాన కొట్టుకుపోతారని వారు తీర్మానం చేసారు ఏకంగా. అందులో బీజాక్షరాలు లేవట. సుదాముని కథ ఏ గ్రంథంలోనూ సచ్చరిత్రలో ఉన్నట్లు లేదట. ఆయనను గర్భదరిద్రుడనటం తప్పట. ఇలా అనటం ఎంత వరకు సబబు!" అని అడిగారు. నిజమే -

"వెర్రివాడి పెళ్లాం వాడకల్లా వదిన" అన్నట్లు ఇలాటి దురహంకారపూరితమైన వ్యాఖ్యానాలకు జవాబు చెప్పకపోవటం మరికొందరిక్కూడా అలుసిస్తుంది. బాబా వారి చరిత్ర ఎప్పుడో వేల ఏళ్లనాటిది కాదు. ఎన్నో రచనలు వచ్చాయి దీనిపై. వాటన్నింటిలోనూ గొప్ప అథారిటీ హేమాడ్‌పంత్ రచించిన సచ్చరిత్రేనటం నిర్ద్వంద్వం. అయితే అందులో కూడా తరువాత కాలంలో ప్రక్షిప్తాలు ఒకటో రెండో ఉన్నాయి తప్ప ఎక్కడా అభూతకల్పనలు లేవు. భగవద్గీతను వేలాది సంవత్సరాలుగా లక్షలాదిమంది జనం నిత్య పారాయణ చేస్తున్నారు. మన వారు రామాయణం, హిందీవారు రామ

చరిత మానస్ నిత్యపారాయణ చేయనిదే గంగముట్టనివారు కోకొల్లలుగా నేటికీ ఉన్నారు. విష్ణు సహస్రనామాలు, లలితా సహస్రాలు, సౌందర్య లహరులు వగైరాలన్నీ పారాయణ చెయ్యబడుతూనే ఉంటాయి. గురుచరిత్ర సాయి సచ్చరిత్ర కూడా ఆ కోవలోనివే. సాయిసచ్చరిత్ర కేవలం మహిమలు ప్రధానంగా ఉన్నది కాదు-బోధ, ఆచరణ ప్రధానంగా ఉన్నట్టిది. అది చదవగా చదవగా అందులోని ఒక్కొక్క అంశమూ మనకు తెలియ కుండానే మన హృదయాల్లోకి, జీవితాల్లోకి చొచ్చుకు వస్తాయి. అటుపై మునుపటి వ్యక్తిత్వాలలోని లోపాలన్నీ సరికావటంతో-పూర్తి క్రొత్త వ్యక్తులుగా కన్పించే సాయిభక్తులెం దరో ఉన్నారు. ఆ విషయం పారాయణ చెయ్యని వారికి చెప్తే అర్థంకాదు. తేనె రుచి నాలుకపై వేసుకుంటే గదా తెలిసేది!

బీజాక్షరాలు, మంత్రాలు వగైరాలకు అనంతశక్తి ఉంది. నిజమే. కానీ, సద్గురువు బోధకు అంతకుమించిన శక్తి ఉన్నది. అది మన ఆలోచనలను అదుపు చేసి అమృతమయం చేయగలదు. సచ్చరిత్రలో అనవసరమైన వాగాడంబరాలు, ఆకర్షణలు లేకపోవచ్చుగానీ సరళసుందరమై, హృద యాంతరాళాలలోకి చొచ్చుకుపోగల చక్కని బోధలున్నాయి. అవసరమైన పుడు ఇవి కమ్చీ ఝుళిపించాయి కూడా. (పరులను నిందించినవాడు అశుద్ధాన్ని తినే పంది వంటివాడనటం యిలాంటి వాటిలో ఒకటి.) ఇవి కష్టాలను తీరుస్తాయనీ, కామ్యాలను (కోరినవి)ఇస్తాయనీ మాత్రమే పారాయణ చేస్తున్నారనటం పొరపాటు. ఆదిలో అలాగే ప్రారంభం కావచ్చు. కానీ క్రమంగా లక్ష్యం మారుతుంది. భగవద్గీతాకారుడైన భగవంతుడే ఒప్పకొన్నాడు-"అర్థీ, ఆర్తుడూ, జిజ్ఞాసువూ, ముముక్షువూ-నలుగురూ నా భక్తులే" అని. అలాంటప్పుడు అర్థార్థులను, ఆర్తులను కాదనే హక్కు మన కెక్కడిది? తల్లి బిడ్డ శరీరానికి తగిలిన గాయం ముందు మాన్పి, ఆ తరు వాత అదెందుకు తగిలిందో- మరోసారి అలాకాకుండా ఏం చేయాలో వివరిస్తుంది. సచ్చరిత్ర మాత కూడా తొలుత లౌకిక ప్రయోజనాలు తీర్చి,





అలా తీరుస్తూనే మరెన్నడూ ఏ కోరికా కోరని స్థాయికి తీసుకువెడుతుంది మనను. ఇది అక్షర సత్యం.

సుదాముడు కుచేలుడిగా మారటం వెనుక గల కారణం గురించి సచ్చరిత్రలో ఉన్నట్లుగా అదే కథ నేను అరవై ఏళ్ల క్రితమే హరికథగా విన్నాను. అప్పటికి సచ్చరిత్ర ప్రచారంలోకే రాలేదు. భగవంతుని వాటా భగవంతుని కివ్వకుండా-దొరికిన మొత్తం తానే అనుభవించాలనుకోవటం మహా ర్దోషం. చుట్టూ వారితో పంచుకొనే తినాలని ఈశావాస్యోపనిషత్తు నిర్దేశిం చింది. ఆ విషయాన్నే యీ కథ సూచిస్తున్నది. భాగవతం సంస్కృతం లోనేకాక అనేకానేక భాషలలోకి వచ్చింది. కొన్నింట కుచేల కథ యిలా కూడా ఉండవచ్చు. ఆయన నిర్ద్వం ద్వంగా "దరిద్రపీడితుడు, కృశీభూతాం గుడు, జీర్ణాంబరుడు" అని భాగవతం చెప్తున్నది. పట్టెడోరముబెట్టుమని పత్రభాజన ధృతపాణు"లై బిడ్డలు వస్తే పెట్టలేకపోతున్నానని ఆయన భార్య దుఃఖించిందనీ ఉన్నది. సరే-యిది ప్రక్కనబెడితే -

సాయి సచ్చరిత్రలో శాస్త్రీయ విషయాలు లేవన్నది మరో వాదం. మహా భక్తుడు ధూర్జటి కవీంద్రుడు "ఏ వేదంబు పఠించెలూత?" అని ప్రశ్నించాడు శ్రీ రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి, మళయాళస్వాముల వారు-వీరెవరూ శాస్త్రాలు, వేదాలు చదివి జ్ఞానులు కాలేదు. యోగులయ్యాక తెలుసుకొన్నారు అవన్నీ. ఆధ్యాత్మికత వేరు-శాస్త్ర జ్ఞానం, పురాణజ్ఞానం వేరు. వాటి ద్వారా ఆధ్యాత్మికత పరిపక్వం కాదు. కేవలం వాచా వేదాంతం రావచ్చునేమో! కానీ ఆధ్యాత్మిక సాధకులకు-వారు పరిపూర్ణస్థాయికి చేరేకొద్దీ శాస్త్రాదికాలన్నీ అలవోకగా కరతలామలకాలవుతాయి. పది పురాణాలు చదివి వాటిని పదుగురికీ ఆకర్షణీయంగా చెప్పటం వేరు-తద్వారా కీర్తి, ధనం ఆర్జించటం వేరు-ఆ శాస్త్రాలు అందించే లోతులను అవగాహన చేసుకొని హృదయంలో నిక్షిప్తం చేసుకోవటం వేరు. ఆధ్యాత్మిక వేత్తలు, మహాయోగులను విమర్శించడానికే శాస్త్రజ్ఞానం చాలనప్పుడు-

స్వయం పరమాత్ముడైన సాయినాథులవారిని, త్రిమూర్తి స్వరూపుడిగా ఎన్నోసార్లు ఋజువు చేసుకొన్న ఆ పరమ కరుణాళుడిని విమర్శించడానికి పురాణ కౌశలం చాలదుగాక చాలదు. అది ఆకాశం మీదికి ఉమ్మి వేయబూనుకోవటమే అవుతుంది.

అలా వాచాలత్వం చూపిన వారికంటే దాన్ని సహించి ప్రాచుర్యం కల్పించిన దేవాలయం వారిది యింకా పెద్ద తప్పు. వారు తాము నమ్మిన(?) దైవదూషణను, వారి చరిత్ర దూషణను వీనులారా విని, ఆమోదించి ఊరుకొన్నారు. గురునిందను, దైవనిందను విని తిరస్కరించకుండా ఊరుకొన్న దోషానికి లోనైనారు. ఇప్పటికైనా వారు తమ దేవాలయానికి సాయికి అచ్చపు భక్తులనే ఆహ్వానించుకొంటూ ఉంటే మంచిదేమో! ఆలోచించండి.

# మరణంలో స్మరణ మహిమ

పూర్వం ఒకప్పుడు మాధవపురం అనే ఊళ్ళో ఒక భక్తుడు నివసిస్తూ ఉండేవాడు. భగవంతుడి పాదారవింద స్మరణ తప్ప అన్యమేదీ అతడు ఎరుగడు. అదే తన జీవితలక్ష్యంగా జీవిస్తున్నాడు. ప్రతిరోజూ పూజా పురస్కారాలు, ధ్యానం, ఆధ్యాత్మిక చింతన ఇంకా ఇతర సాధనానుష్ఠానాల చేత ముక్తి మార్గాన జీవిస్తుండేవాడు. ఇలా లౌకిక విషయాల్లో పూర్తిగా విముఖుడై ఆధ్యాత్మిక చింతన చేసే అతణ్ణి పలువురు శిష్యులు ఆశ్రయించారు. వారంతా అతడి వద్ద జ్ఞానోపదేశం పొంది, భగవద్భక్తిని పెంపొందించుకొనసాగారు. ఆ శిష్యులకు అతడు మార్గగామియై జ్ఞానగురువుగా మసలుకోసాగారు. ఆ గురువు తాను తలచినదే చెబుతూ, చెప్పినదే చేస్తూ త్రికరణశుద్ధిగా, ఆదర్శప్రాయుడై వెలుగొందసాగాడు.

ఇలా ఉండగా ఆ భక్తుడికి వృద్ధాప్యం వచ్చింది. తన ఆయుష్షు ఇక





పూర్తి అయ్యే తరుణం సమీపించినదని గ్రహించి, తన మరణం కాశీలో జరగాలని కోరుకొన్నాడు. శిష్యులు గురువుగారి కోరికను ఎరిగి ఆయన్ను కాశీక్షేత్రానికి తీసుకొనిపోవడానికి నిశ్చయించుకొన్నారు. గురువుగారి దగ్గరకు వెళ్ళి, “గురువర్యా! మీ ఇష్టప్రకారం కాశీక్షేత్రానికి మిమ్మల్ని తీసుకొని వెళతాము. దయచేసి అనుమతి ఇవ్వండి” అని వేడుకొన్నారు.

వృద్ధుడైన ఆ గురువు, శిష్యుల మాటలకు సంతోషించి, అందుకు సమ్మతించాడు. అదే తమ భాగ్యంగా భావించి శిష్యులు పల్లకి ఏర్పాటు చేసి, దాన్లో చక్కని పరుపును, మెత్తను అమర్చి గురువుగారిని ఆశీనుణ్ణి చేసి కాశీకి బయలుదేరారు. అలా ప్రయాణం చేసిన కొన్ని రోజుల తరువాత కాశీ పొలిమేరకు చేరుకొన్నారు.

ఇంతలో పల్లకిలో కూర్చున్న గురువుగారికి అంతిమ ఘటియ సమీపించింది. తనకు యమదర్శనం అవడం చేత గురువు శిష్యులను, “మనం ఎంతదూరం వచ్చాం? కాశీక్షేత్రాన్ని చేరుకొన్నామా?” అంటూ ప్రశ్నించాడు. అందుకు శిష్యులు, “స్వామీ! పల్లకి ఇప్పుడే కాశీ పొలిమేరలోని ‘మాలవాడ’ చేరింది. ఇక కాస్సేపట్లో కాశీక్షేత్రంలో అడుగు పెట్టబోతున్నాం’ అన్నారు. ఆ కాలంనాటికి అస్పృశ్యతా దురాచారం ఉండేది. ప్రాణాలు పోతున్న సమయంలో అతడి చెవికి ‘మాలవాడ’ అనే పదం మాత్రమే వినిపించింది. ఆ మాట వినపడగానే అతడి మనస్సులో తన పాండిత్యం, దైవభక్తి అన్నీ వైదొలగి మాలవాడ గురించిన తలంపులు మాత్రమే కలిగాయి. ఆ తలంపులలో ఉండగానే అతడి ప్రాణాలు పోయాయి.

ప్రాణం పోయేటప్పుడు చెవిలో పడ్డ మాట, మనస్సులోని తలంపు ఇవన్నీ కలసి అతడి మరుజన్మకు కారణమయ్యాయి. అతడు మాలపల్లెలో ఒక నిమ్న కుటుంబంలో జన్మించాడు. అయితే పూర్వజన్మ వాసనలు అతడిలో నిలిచే ఉన్నాయి. పూర్వ పుణ్యఫలం అతడికి ఉన్నది. అతడి తండ్రి ఆ ఊరి కాపరిగా పనిచేసేవాడు.

**(సశేషం)**

# జ్ఞానోదయమే జీవన సాఫల్యము

- వల్లభనేని కుటుంబరావు

**(గత సంచిక తరువాయి)**

నేనూ ఈ విషయం ఎప్పుడూ అనుకొంటాను, ఎందుకు మెజారిటీ ప్రజలు ప్రపంచ సుఖాలు, భోగాల కోసం పరుగెత్తి పతనమవుతున్నారు. అది వారికి తెలియట్లేదు, చెప్పినా వినే స్థితిలో లేరు అనుకొంటాను. వారి పూర్వజన్మల కర్మఫలం అని అర్థమయింది. చేసిన దుష్కర్మఫలం తగిన ప్రాయశ్చిత్తం చేసుకొంటేనే పోతుంది.

చిత్తం త్రిగుణములతో సమ్మేళనం చెందినప్పడు సంసారబంధం కారణమగుచున్నది. ఆ చిత్తమే నారాయణుని యందు ఆసక్తి కల్గినప్పడు మోక్షమునకు కారణమగుచున్నది.

అనేక జన్మల మలిన సంస్కారాలతో వచ్చిన ఈ చిత్తం ఎంత శ్రమ పడితే శుభ్రం చేయగలం. కానీ మనం శ్రమపడడానికి అంగీకరిస్తున్నామా? ఇక ఆచరణ కష్టపడడానికి మనస్సు ఒప్పకోదు. ఎప్పడూ సుఖం, భోగం కావాలంటుంది మనసు. ఉ॥ ప్రతిరోజు మంచి రుచికరమైన భోజనం, పిండివంటలు పుష్టిగా తిని శరీరాన్ని పెంచి ఆపై హాయిగా నిద్రపోవటానికి మనస్సు ఇష్టపడుతుంది. మీరు షిరిడీసాయి, సత్యసాయి, రమణమహర్షి, చంద్రశేఖర సరస్వతి, సిద్ధేశ్వరానంద సరస్వతి, విద్యా ప్రకాశానంద సరస్వతిని చూడండి. వారు శరీరాన్ని శుష్కింపజేసి, ఇంద్రియములను, రుచిని, మనస్సును జయించారు.

ఒక్కరోజు సత్కార్యం చేసి ఊరుకుంటే మనోమాలిన్యాలు పోవు. అనుదినం సత్కార్యాలు చేస్తేనే మనోమాలిన్యాలు పోతాయి. నిస్వార్థ సేవా కార్యక్రమాలు నిత్యం చేస్తేనే మనస్సు నిర్మలమయ్యేది. మనస్సు నిర్మలమైనప్పడు పరమాత్మ దర్శనం కలుగుతుంది.





యోగం అంటే శ్వాస నియంత్రణ చర్య కాదు. యోగం అంటే కలయిక. మనం జీవితం గడపాలంటే ఎందరో వ్యక్తులు, వస్తువులు మనతో కలవాలి. గృహ, ధనం, భార్యాపిల్లలు, స్నేహితులు, బంధువులు కలుస్తుంటారు. కాలం అయిపోగానే విడిపోతుంటారు. ఈ యోగ, వియోగాలు జీవితంలో జరుగుతూనే ఉంటాయి.

కానీ జీవితంలో మనతో ఎప్పటికీ శాశ్వతంగా నిలిచి ఉండేదే యోగం. అదే ఆత్మ, పరమాత్మ కలసి ఉండే యోగం.

మనసు మూలానికి చేర్చడానికి యోగులు ప్రాణాయామం చేస్తారు. సంకల్పం ఎక్కడ ఉద్భవిస్తుందో అక్కడ శ్వాస కూడా పుడుతుంది. శ్వాస నిలకడ చెందితే మనసు ఆ మూలంలోనే అణుగుతుంది.

సుఖం, దుఃఖం యోగ వియోగాలే. చిత్తచాంచల్యం లేకుండా ఏకాగ్రత సిద్ధిస్తే, చిత్తశుద్ధి లభిస్తుంది. నీళ్లల్లో చేపలు గ్రుడ్లు పెడతాయి. ఆ గుడ్లు నీళ్లల్లో తేలతాయి. చేపలు ఆ గుడ్ల మీద కూర్చొని పొదగదు. తేలుతున్న ఆ గుడ్లను చూచినంత మాత్రాన అవి చేప పిల్లలవుతాయి. ఇది శాస్త్ర నిరూపణ. సృష్టిరహస్యం. అందుకే గురువు యొక్క చూపు మన మీద ప్రసరిస్తే చాలు. దీనినే నయనదీక్ష లేక మత్స్య దీక్ష అంటారు. సత్య సాయిబాబా దగ్గర చాలామంది ఆయన చూపు వారిపై పడాలని ఆతృతగా ఎదురుచూసేవారు. ఆయన చూపుపడగానే సంతోషించేవారు. గురువు చూపే అనుగ్రహం. సిద్ధ గురువులు షిరిడీ సాయిబాబా, సత్య సాయిబాబా, చంద్రశేఖర సరస్వతి, సిద్ధేశ్వరానంద సరస్వతి, వీరందరూ సిద్ధ గురువులు. వీరు కరుణచూపుతోనే ఆశీర్వదించగలరు.

ఇంతకుముందు తాబేలు గురించి చెప్పాను. దీనిని కమఠదీక్ష అంటారు. అంటే గురువు ఆ శిష్యుని గురించి స్మరించినంతనే అతనికి గురువు అనుగ్రహం కలుగుతుంది.

ఇది నేను మా గురువు ద్వారా గ్రహించాను. ఆయన చూపుతోనే

ఆశీర్వదించే వారు. అదే గురువు అనుగ్రహం.

"శ్రోత్రం, చక్షుః, స్పర్శనంచ్య, రసనం, భ్రూణమేవచ
అధిష్టాయ, మనశ్చాయం, విషయానుప సేవతే" ॥

(పురుషోత్తమ యోగము)

వాయువు పుష్పాదుల నుండి గంధం హరించునట్లు గంధం అంటే వాసనను తీసుకున్నట్లు జీవుడు కర్మ వశమున శరీరము విడుచునపుడు, పూర్వ శరీరము నుండి మనస్సును, ఇంద్రియములను తన వెంట తీసు కొని పోవుచున్నాడు. అనగా పూర్వదేహం నుండి మనస్సు, ఇంద్రియాలే నూతన శరీరమున ప్రవేశించుచున్నవి. (జ్ఞానేంద్రియములు అంటే శబ్ద, స్పర్శ, రూప, రసగంధలు). వీటి సంయమనము లేని వారికి ముక్తి అసంభవము. ఎందుకంటే చిత్తవృత్తి నిరోధములు కావు. అభ్యాస, వైరాగ్యములతోనే చిత్తవృత్తులు నిరోధములగును. అవే ముక్తికి మార్గములు. అభ్యాస, వైరాగ్యములు సాధన చేయాలంటే శ్రద్ధ ఉండాలి.


మనిషి మాయాధీనుడై ప్రీతి మార్గాన్నే అనుసరిస్తున్నాడు. శ్రేయో మార్గం కష్టమని సాధన చేయటం లేదు. మరి ముక్తి ఎలా లభిస్తుంది.

బాహ్య ప్రపంచ సుఖభోగాల మీద కోరికలు నశించనంత వరకు జన్మలు తప్పవు. భగవత్ దర్శనం జరగదు. మనిషి తనలో ఉన్న అరిషట్ వర్గాలను జయించకుండా త్రిగుణాలను జయించే సాధనలు చేయ కుండా, అంతర్యానము చేయకుండా, బహిర్యానం కోసం ప్రాకులాడి, తీర్థయాత్రలు, గుళ్ళ చుట్టూ ప్రదర్శనలు, గంగాస్నానాలు చేసినంత మాత్రాన, మనిషిలో అరిషట్ వర్గాలు నశించి, త్రిగుణాతీతుడయి, వైరాగ్య భావన వస్తే అందరూ అదే అవలంబించి ఈ జన్మలోనే జీవన్ముక్తులవు తారు. ఇన్ని జన్మలు, ఇంత జనాభా ప్రపంచంలో ఉండదు. అసలు అభ్యాస, వైరాగ్య నిష్కామకర్మ సాధనలు వదిలి పైవాటి వల్ల ముక్తి వస్తుందా!

**(సశేషం)**







# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

**(గత సంచిక తరువాయి)**

ఏసే కరణియా విణ్ ॥ స్వయంభచి జై నివృత్తిపణ్ ॥
దయచే శ్రీ చరణ్ ॥ వందిలే ఏసే ॥

భావార్థం : అటువంటి అకృత్రిమమైన స్వయంభువు అయిన నివృత్తి స్వభావం కలిగిన సద్గురు నివృత్తి నాథుని చరణాలకు అభిన్నుడనై ప్రణ మిల్లుతున్నాను. ప్రణమిల్లడం, ప్రణమిల్లబడటం అనే ఆట ముగిసింది. గురు, శిష్య బేధం ఇక అంతరించింది. ఆ సద్గురునాథుడు ఒక్కడే ఏకత్వంలో వసించుచున్నాడు. సద్గురు మినహా ఇక ఏదీ మిగిలియుండలేదు. నా యొక్క "నేను" అందులోనే ఐక్యమైంది.

ఆతా జ్ఞానదేవ్ మ్హణే ॥ శ్రీ గురు ప్రణామ్ యేణే ॥
ఫేడిలే వాచా ఋణే ॥ చేహీ వాచాంచీ ॥

భావం : ఇప్పుడు జ్ఞానదేవుడంటున్నాడు. గురువుకు ప్రణామం చేసి, నాలుగు వాణుల మ్రొక్కును తీర్చుకుంటున్నాడు.

భావార్థం : ఇప్పుడు జ్ఞానేశ్వరుడు అంటున్నాడు. నేను "సద్గురువుకి ప్రణమిల్లి, నాలుగు వాణులకు మ్రొక్కును చెల్లించాను". ఈ ప్రకరణంలో సద్గురు స్వరూపం యొక్క వర్ణనను పూజ్య భావంతో చేస్తూ, సద్గురువు మహత్యాన్ని వర్ణిస్తున్నాను. అంటే ఏఏ గురువులు ఉన్నారో, వారందరూ నివృత్తి స్వరూపులు అని హృదయపూర్వకంగా ఒప్పుకుంటున్నాను. పేర్లు భిన్న భిన్నమైనప్పటికీ, వారి యొక్క సద్గురు తత్వం నివృత్తి స్వరూపమే! అంటే, సద్గురువులందరూ నివృత్తి స్వరూపులు. శిష్యులంతా జ్ఞానస్వరూ పులు. అలా సాధకుడు భావించినట్లయితే సాధకుడు కృతార్థుడవుతాడు. ఈ తత్వజ్ఞానాన్ని పరిపూర్ణంగా విశ్వసిస్తున్నాను. మిగతా వారందరూ అహం

కారంతో వారసత్వాన్ని కొనసాగిస్తారు. అంటే వారసత్వం కొనసాగించే వారు సద్గురువుకు స్తుతిగానం చేస్తారు. వారు నిరంతరం ఐహిక సుఖాల కోసం ప్రాకులాడుతారు. వారు సద్గురువు యొక్క శిష్యులు కారు. వారు నటులు. అటువంటి అధములు జ్ఞానేశ్వర్ మహరాజ్‌కు సమానమెలా అవుతారు. ఆదిశంకరాచార్యులకు లభించిన శిష్యులు జ్ఞానేశ్వర్ మహరాజ్ వంటి శిష్యులు. మద్వాచార్యులకు కూడా శిష్యులు అలానే లభించారు. గోరక్‌నాథ్ శిష్యులు మశ్చీంద్రనాథ్, నివృత్తి నాథ్, గహనీనాథ్ మరియు నివృత్తినాథ్‌కు శ్రీశ్రీశ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్ వంటి శిష్యులు లభించారు. జనార్థునుకి ఏక్‌నాథ్ మహరాజ్, కళ్యాణునికి రామదాసు, తుకారాంకు పింపళనేర్ వంటి శిష్యులు లభించారు. వివేకానందుడు రామకృష్ణునికి జ్ఞానేశ్వర్ మహరాజ్ వంటి శిష్యులు, ఇప్పుడు షిరిడీ గ్రామంలో నివృత్తి స్వరూపులు సాయినాథ్! వారిలో అణుమాత్రం కూడా తేడా లేదు. నివృత్తి నాథ్ త్రయంబకేశ్వరీలో పవిత్ర గోదావరి తీరాన ఉండేవారు. అలాగే గోదావరికి ఐదు క్రోసుల దూరంలో శ్రీ సాయినాథుడు నివసించుచున్నారు.

ఓ నివృత్తి స్వరూప సాయినాథా! కృపాకటాక్షాలను కురిపించి నావైపు చూడూ! వామనశాస్త్రి శిష్యుడు దాసగణుపై దయ ఉంచు! నీవు మరియు వామన్ కేవలం నామాలు మాత్రమే భిన్నం! అసలులో మీరు ఒక్కరే! అందువలన నా వినతిని ఆలకించండి. నా శిష్యత్వాన్ని మిగలనివ్వకు, అసత్యమైన బేధంతో ఉండనీయకు. పేరులో మినహా మిగిలిన వాటితో నీ నుండి ఎటువంటి భిన్నత్వాన్ని చూపకు. నామంతో జ్ఞానేశ్వర్ నివృత్తి నాథునితో భిన్నం, ఆయన జ్ఞానేశ్వరునిగానే మిగిలాడు. అంటే, కేవలం శూన్యమైన నామంలోనే ద్వైతం మిగిలింది. నామం, రూపం అనునవి భ్రమపూర్వకం. వాటికి ఏ విధమైన ప్రాముఖ్యం లేదు. అందువలన వారి నామంలోని ద్వైతం నిరర్థకరం. సస్వరూపంలో ఏకమై నామ రూపంలో విస్తరించారు. మాయ కారణంగా వారు వేరు వేరుగా కనిపించసాగారు.





కానీ, అదంతా భ్రమ! నామ రూపాల విస్తారం కేవలం చెప్పడానికే, సస్వరూపంలో వారికి ఎటువంటి బేధం లేదు. సరి! ప్రతి ఒక్కరూ తమ నిజ గురువును నివృత్తినాథునిగా నూహించుకుని, జ్ఞానేశ్వర్ వాణి అయిన అమృతానుభవాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలని దాసగణు ప్రార్థిస్తున్నాడు.

నిజానికి బాబా తమ ఈ మాటల ద్వారా అమృతానుభవానికి సంబంధించి భావ సంక్లిష్టతను దూరం చేయడమే కాదు, దాసగణు పారమార్థిక పురోగమనానికి పెను అవరోధంగా నిలిచే తన మనసులోని సోదర సాయి భక్తుల పట్ల నున్న వ్యతిరేక భావాలను నిరసించారు. అటువంటి భావాల నుండి తమను విముక్తుడను చేసారు. బాబా ఎన్నడూ ముఖతః ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసి బోధించేవారు కారు. కానీ, కొన్నిసార్లు ఆయన ముఖతః వెలువడే నిగూఢమైన మాటలలో అద్భుతమైన బోధ అంతర్లీనమై ఉంటుంది. ఆ బోధలో అమూల్యమైన ఆధ్యాత్మిక సత్యాలు ఉండటమేగాక, సాయి యోగంలో, సాయి మార్గంలో భక్తులు అప్రమత్తంగా ఉండవలసిన ఎన్నో అంశాలు ఇమిడి ఉంటాయి.

మన హృదయంలో నుండే సాయి, సహచర సాయిభక్తుల హృదయాల లోను ఉంటారు. వాస్తవానికి మనందరి రూపంలో ఆయనే నడయాడుతున్నారు. హంసరాజ్ అనే భక్తుడు పిల్లిని కొడితే, ఆ దెబ్బను బాబా తమ వీపుపై చూపించారు. మహాల్సాపతి చూడటానికి అసహ్యంగా ఉన్న కుక్కను తన ఇంటి దగ్గర కర్రతో కొట్టి అదిలిస్తే, “అరే భగత్ ఈరోజు నీవు నన్ను కర్రతో కొట్టావు” అని మసీదులో కూర్చొని వ్యాఖ్యానించారు. చావడి ఉత్సవ సమయంలో వినియోగించే “శ్యామ్ సుందర్” అనే గుర్రాన్ని శిక్షకుడు కొడుతుంటే, తన ఒంటిపై వాతలను చూపించి ఆ శిక్షకుడిని వారించారు. ఆ విధంగా ఎన్నో అసంఖ్యాకమైన లీలల ద్వారా, సర్వజీవులలో తామే నిండియుంటామని లెక్కకు మిక్కిలి అనుభవాలను బాబా ప్రసాదించారు.

**(సశేషం)**

శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

"అయితే మనమే వారి మీద హఠాత్తుగా దాడిచేసి ఇప్పుడే రూపు మాపుదాం. శత్రుశేషం లేకుండా చేసుకుందాం" అన్నాడు కర్ణుడు.

శకుని సరేనన్నాడు. మిగతా వారు ఏకీభవించారు. వెంటనే యుద్ధానికి కావలసిన సర్వ సన్నాహాలను పెద్ద పెట్టున ప్రారంభించారు. దుర్యోధనునికి అంతరంగ మిత్రులైన రాజులకు, సామంతులకు వార్తలు వెళ్లాయి. ఈ విషయం అతి గోప్యంగా జరగాలి. భీష్మ, ద్రోణ, కృపులకు గాని, కురు కుటుంబ ప్రముఖులకు గాని తెలియకూడదు. వారికి తెలిస్తే పడనీయరు. పోగా పాండవులకు వారు ఈ రహస్యాన్ని తెలియజేయవచ్చు.

కాని విదురుని చారులు ఈ ప్రయత్నాలను పసిగట్టారు. ఈ వ్యవహారం శ్రీకృష్ణ ద్వైపాయనుల వారికి తెలిసింది.

ఆయన హుటాహుటిన వచ్చి భీష్మద్రోణాదులతో మాట్లాడారు.

"పాండవులు నీవు పెదతండ్రివని కుటుంబ మర్యాదను పాటిస్తూ ఇప్పటికి నీకు మర్యాద చూపుతున్నారు. ఎందుకు చూపుతున్నారో నీవు గ్రహించడం లేదు. సనాతన ధర్మం కుటుంబ కర్తను మన్నించాలని చెబుతున్నది. నీవు ఇంకా నేటికీ కుటుంబంలో పెద్దవాడివి గనుక, అలాంటి వారి మీద దండయాత్రా? ఆ దుస్సాహసమే చేస్తే నీ కుమారులకు ఇప్పుడే మరణం ఆసన్నమైందన్నమాట. పిలిచి నీ కొడుకులను అదుపున పెట్టుకో! చేజేతుల సర్వనాశనాన్ని ఆహ్వానించుకోకు" అని ధృతరాష్ట్రుణ్ణి గట్టిగా మందలించాడు.

ధృతరాష్ట్రుడు దుఃఖిస్తూ, "మీ కోడలు గాంధారి, భీష్మ, ద్రోణ, విదురులు వద్దన్నా, కొడుకు మీద ప్రేమను వదులుకోలేక పాపమని తెలిసి కూడా





ద్యూతానికి రమ్మని యుధిష్ఠిరుణ్ణి పిలిచాను. ఇప్పుడు నన్ను ఏమి చేయమంటారు?" అని అడిగాడు.

"నేను, భీష్ముడు, నీవూ, విదురుడూ జీవించి ఉండగా పాండవులకు ఏ అరిష్టమూ జరుగడానికి వీలు లేదు. ఆ అడవులలో కూడా వారి కీర్తి, పరాక్రమాలు పట్టపగటి సూర్యునిలా వెలుగుతున్నాయి. నీ కుమారుణ్ణి ఒప్పించు లేదా శాసించు, పాండవులను పిలిపించు, వారిద్దరి మధ్య సఖ్యత చేకూర్చే మార్గాన్ని గురించి ఆలోచించు. కోరి సర్వనాశనానికి కారకుడివి కాకు".

'నా కొడుకు నా మాట వినడు. మీరే అతనిని మందలించాలి' అని ధృతరాష్ట్రుడు తన నిస్సహాయతను తెలిపాడు.

'నేనుగా నీ కొడుక్కి చెప్పవలసింది ఏమీ లేదు. రేపో మాపో మైత్రేయ మహర్షి ఇక్కడికి వస్తాడు. ఆయన మహాతపస్వి. ఆయనను ఆదరంగా కురు సభకు స్వాగతించు. సభలో దుర్యోధనాదులను నిగ్రహించమని ప్రార్థించు" అని కృష్ణద్వైపాయనుడు హితవు పలికాడు.

రెండు రోజుల తరువాత మైత్రేయ మహర్షి హస్తినకు వచ్చారు. ఆ మరునాడు కురుసభను సమావేశపరచి ఆయనకు ధృతరాష్ట్రుడు స్వాగత సన్మానాలు జరిపించాడు. కుశలప్రశ్నలు అయిన తరువాత 'మహర్షి! ప్రస్తుతం ఎక్కడ నుండి వస్తున్నారు?' అని అడిగాడు.

'కామ్యకవనాన్నుంచి వస్తున్నాను. అక్కడ పాండవులను పరామర్శించి వచ్చాను'.

'వారందరూ క్షేమంగానే ఉన్నారా? మహర్షీ' అని ధృతరాష్ట్రుడడిగాడు.

'దేవతల ఆశీస్సులు అండగా ఉన్న వారికి భయమేమున్నది మహారాజా! వాళ్లందరూ క్షేమంగానే ఉన్నారు. నేను జరిగిన సంగతులన్నీ విన్నాను. ద్యూతం పేరిట ఇక్కడ ఈ కురుసభలో జరిగిన అక్రమాల గురించీ విన్నాను. అయినా మీరు, భీష్మాచార్యుల వారు బ్రతికి ఉండగా అంతటి

దారుణాన్ని ఎలా జరుగనిచ్చారయ్యా! అది ఎంత దారుణానికి దారితీస్తుందో ఊహించలేదా? మీరందరూ ఏకమయ్యే ఆ అధర్మ ద్యూతం నడపడానికి కుట్ర పన్నినట్లున్నారు. అది ఒక్క కురుకులానికే కాదు, సర్వాక్షాత్ర జగత్తుకు ఎంత అవమానం?' అన్నాడు.

తరువాత ఆ మహర్షి దుర్యోధనుణ్ణి దగ్గరికి పిలుచుకొని, మధురమైన ధోరణిలో అతనితో మాట్లాడాడు. మృదువుగా, సున్నితంగా ఉపాలంభించే ధోరణిలో ద్యూతక్రీడ ఎంత అధర్మానికి, అనర్థాలకు మూలమవుతుందో వివరించి చెప్పాడు. పరస్పరం కలహించుకోడం వల్ల లోకక్షేమానికి కూడా హాని కలుగుతుందన్నాడు.

'దుర్యోధనా! వాళ్లు నీ కారణంగా మొదటి నుంచి నిలకడ లేకుండా తిరుగుతున్నారు. కనుక బలగాలను సమీకరించుకునే అవకాశం వారికి లేకపోయిందనుకోకు. వాళ్లను బలహీనులుగా చూడకు. లోకమంతటా వారి పట్ల ఆదరం పెరుగుతున్నది. మీ పట్ల ద్వేషం పెరుగుతున్నది. ఒక్క మాట అర్థం చేసుకో, మీరు పుట్టింది కురు కులంలో, కురు కులం ధర్మ రక్షణకు అంకితమైన రాజ్యం. సామాన్యుడు నేరం చేస్తే రాజు శిక్షిస్తాడు, రాజే పాపం చేస్తే ధర్మమే శిక్షిస్తుంది అని నచ్చబలికి, మైత్రేయుడు 'నీకు తెలియనిదని కాదు నాయనా! భీమార్జునులు ప్రబల ప్రతాపమూర్తులు. భీముని చేతిలో హిడింబుడు, బకుడు, జరాసంధుడు హతులయ్యారనీ తెలుసు. మొన్న మొన్న ఈ వనవాస కాలంలోనే హిండింబుని సోదరుడు కిమ్మీరుణ్ణి భీముడు సంహరించాడు. తెలిసీ, వాళ్లతో కయ్యానికి దిగకు. నీకై నీవు స్నేహానికి చేయి చాచితే వాళ్లు తప్పక ఆమోదిస్తారు నాయనా' అని నచ్చచెప్పాడు.

దుర్యోధనుని బుద్ధి భ్రంశమై ఉన్నది. మహర్షి మాటలకు తిరస్కార ముఖకవళికలతో విన్నట్లు కనిపించాడు. కాలి బొటనవ్రేలితో నేలను రాస్తూ 'ఓయి బడుగు జడధారీ! నీ మాటలకు ఇక్కడ విలువ లేదు' అని లోలోపల గొణుక్కున్నాడు.

**(సశేషం)**





# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

**(గత సంచిక తరువాయి)**

తే.గీ. సాయి సర్వజ్ఞు పరమేశు శాంత యుతుని
సతత మననంబు ధ్యానంబు సరిగ జేసి
భక్తి శ్రద్ధల గొలువంగ పరవశించి
నిన్ను నడిపించు నిటలాక్షు నిలయ బాట 36

## 24. శిక్ష నొసగు విధము

తే.గీ. విశ్వ నాటక రంగాన వింత గొల్వ
నాట్య మాడించు నటరాజు నటన మాడ
శిరిడి భక్తుల ప్రేమను చిత్తగించి
తానె సాకార రూపుడై తరలి వచ్చె 1

తే.గీ. ఆత్మ లన్నిట నిండిన నాత్మ సాయి
ఆర్తి జనముల దీర్చెడు నాత్మ బంధు
ఆత్మ ఫలకాన యామూర్తి యమరియుండ
సాయి సర్వేశు ధ్యానించు సార్థకతకు 2

తే.గీ. ఊది పంచుచు బొట్టెట్టి ఉత్సుకతన
పలుకరించుచు భక్తుల పనుచు చుండు
ఆరతి ముగియ గృహముల కాదరమున
కొలసి వత్తము రారండి కోర్కెదీర 3

తే.గీ. ఉచిత రీతిన బోధించె యుత్కటంపు
తత్వ ముపనిషత్తు దెలియ దాస గణుకు
మనసె కారణ మగునంచు మర్మమెల్ల
పనిమనిషి చీరె యానంద పాట తోడ 4

ఆ.వె. మనకు ప్రాప్తమెంతో మనకిచ్చు భగవంతు
డనుచు సంతసంబు ననుభవించి
తృప్తి జెందవలయు నున్నంత దానితో
చిరుగు చీరె యైన చింత లేక 5

ఆ.వె. వింత గొల్పు చుండు విపరీత మనిపించు
శిక్షనొసగు విధము శిరిడి సాయి
సందియములు దీర్చు సందేశ క్రమమును
భక్త జనుల కోర్కె యుక్త రీతి 6

తే.గీ. పగలు, రాత్రియు, నిద్రను, పనులు జేయు
నపుడు వారి వారికి దర్శనంబు లిచ్చి
కోర్కెలమరంగ జేసెడు కొత్తదనము
సాయి మార్గాలు వర్ణించ సాధ్యమగునె 7

ఆ.వె. ఈశ్వరుఁడగు మూలమీ విశ్వమున కెల్ల
యతని యాజ్ఞ వలనె యమరు నంత
యిచ్చినంతె చాలు యీశ్వరు కృపయంచు
యీద వలయు గాదె యీతి నందు 8

ఆ.వె. కర్మ జేయ వలయు కామించ కెద్దేని
పరుల ధనము కాశ బడక యుండి
పరగు నాత్మలందు పరమాత్మ గనుచును
భక్తి గొలువ వలయు ప్రాణి తతుల 9

**(సశేషం)**





# బాబాపై భారం వేస్తే...

- యిమ్మిడిశెట్టి ప్రభాకరరావు, హైదరాబాదు

1984వ సంవత్సరంలో శ్రీనాథ్ అనే అతను షిరిడీ వెళ్ళాడు. ఆరతి అయిపోయిన తరువాత దర్శనం కోసం క్యూలో నిలుచున్నాడు. ఆ సమయంలో కొంచెంసేపు క్యూ నిలిచిపోయింది. ఒకవేళ కదిలినా, చాలా నెమ్మదిగా కదులుతున్నది. శ్రీనాథ్ తనకు ముందున్న వ్యక్తిని పలకరించి తనను తాను పరిచయం చేసుకుంటూ అతడి వివరాలడిగాడు. అతడు నాగపూర్ నుంచి వచ్చాడట. శ్రీనాథ్‌కి సాయిబాబా భక్తుల్ని పలకరించినప్పుడు బాబాతో వాళ్ళ అనుభవాలు అడగడం అలవాటు. అలాగే అతడిని కూడా తను సాయిభక్తుడు ఎలా అయ్యాడో వివరించమని జిజ్ఞాసతో అడిగాడు.

శ్రీనాథ్ మాటలకు ఆ భక్తుడు వెనుదిరిగి చూశాడు. అతడి కళ్ళతో బాబా యందు ప్రేమ, దృఢమైన భక్తి, విశ్వాసం ద్యోతకమయ్యాయి. అతడు తన అనుభవాన్నిలా నెమ్మదిగా వివరించసాగాడు. "ఒకసారి నాకు భరింపలేనంత కడుపునొప్పి వచ్చింది. నొప్పితో మెలికలు తిరిగిపోయేవాణ్ణి. అల్లోపతి వైద్య చికిత్స చేయించుకొన్నాను. నా వ్యాధి తగ్గడానికి బదులుగా మరింత ఎక్కువయింది. ఇతరత్రా శారీరక ఇబ్బందులు కూడా తలెత్తాయి. మందులు మాకులు మింగలేక, వ్యాధి వలన కలిగే బాధలు భరించలేక విసిగిపోయాను. ఏమయింతే అయిందని చికిత్స నిలిపివేశాను. స్నేహితులు, బంధువుల సలహా మేర ఒక ప్రముఖవైద్యుడి దగ్గర ఆయుర్వేద చికిత్స చేయించుకొన్నాను. ఫలితంగా నా శరీరమంతా ఉబ్బిపోయింది. తర్వాత 2, 3 రోజులకు వాపు తగ్గిపోయింది. కాని నా శరీరమంతా కృశించిపోయి ఎండిపోయినట్లయింది. కళ్ళు లోతుగా గుంతలు పడిపోయాయి.

నా గ్రహచారం కొద్దీ ఇది వరలో చేయించుకొన్న చికిత్సల పర్యవసానంగానో ఏమో నా అరిపాదాల చర్మం మొత్తం తొక్క ఒలిచినట్లుగా ఊడిపోయింది. దాని పరిణామం ఎంత భయంకరంగా ఉందంటే పాదాలలోని నరాలు బయటపడ్డాయి. నడవడం మాట దేవుడెరుగు, కనీసం

నేల మీద కాలు మోపి కూడ నిలబడలేని దుస్థితి. అప్పటినుంచి పూర్తిగా మంచానికే పరిమితమయ్యాను. నా దయనీయమైన స్థితికి నా భార్య చలించిపోయింది. మరింకేదైనా వైద్యం చేయించుకోమని, లేకపోతే ఏదైనా హాస్పటలులో చేరి చికిత్స చేయించుకోమని బ్రతిమిలాడింది. నేను అప్పటికే చాలా రకాల వైద్యాలలో మందులు తిని తిని విసిగిపోయానని, ఆ ఇంజక్షన్ల బాధ తట్టుకొనే శక్తి నాకు లేదని చెప్పాను. అంతేకాదు ఏ మందులు వాడితే నా శరీరంలో ఎలాంటి కొత్త బాధలు తలెత్తుతాయో చెప్పలేమని, అందుచేత ఏ డాక్టరును ఆశ్రయించనని ఆమెకు నచ్చ చెప్పాను. ఈ వ్యాధి నా కర్మఫలం; అనుభవిస్తాను అన్నాను.

ఇంక ఈ వ్యాధులు తగ్గుతాయనిగాని, ఎప్పటికైనా లేచి నడవగలుగు తానని గాని ఆశ నాలో లవలేశం కూడా లేదు. అలా కృంగి కృశించి నిరాశా, నిస్పృహలతో కాలం గడుపుతున్న సమయంలో బహుశః సాయి బాబా యొక్క ప్రేరణ వలననే కావచ్చు, ఆయన మనకిచ్చిన “మీ భారములు నాపై పడవేయుడు, నేను మోసెదను” అన్న అభయప్రదానం హఠాత్తుగా స్ఫురణకొచ్చింది. నా మనసు ఎంతో తేలికపడింది. ఆరోజు నుంచి సాయి నామాన్ని స్మరిస్తూ బాబా ఊదీని బొట్టు పెట్టుకొని, రోజుకు మూడుసార్లు ఊదీ నీటిలో కలుపుకొని తీర్థంలా సేవించసాగాను. నిరంతరం సాయి నామాన్ని జపిస్తూండేవాడిని. తాపఃశ్శాంతి కోసం అరిపాదాలకు వెన్న పూసి కాటన్ గాజుగుడ్డతో కట్టు కట్టించుకొనేవాడిని. ఏమయినా బాబాదే భారం అని నిశ్చింతగా ఎలాంటి ఆందోళన లేకుండా వుండిపోయాను. నెమ్మది నెమ్మదిగా వ్యాధులు తగ్గుముఖం పడుతూ స్పష్టత చేకూరడానికి సుమారు ఆరు నెలల సుదీర్ఘకాలమే పట్టింది. వ్యాధి పూర్తిగా తగ్గిపోయి ఇదివరకటి లాగానే సంపూర్ణ ఆరోగ్యవంతుణ్ణయ్యాను. బాబా మనకు బోధించిన ‘శ్రద్ధ-సబూరి’ అనే విలువైన పాఠాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకొన్నాను. బాబాను దర్శించి కృతజ్ఞతలు తెలియజేసుకోవడానికే నేనిప్పడొచ్చాను. నిజానికి ఇది నాకు సాయి ప్రసాదించిన పునర్జన్మ” అని ముగించాడు.

బాబా యొక్క అభయ ప్రదానాలు ఏనాటికీ పొల్లుపోని అక్షర సత్యాలు!

జై సాయిరాం!





# సాయిబాబా వారిని ఎందుకు పూజించాలి?

## సాయిదత్త పీఠం

## శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు, సాయిధామం-508 126

గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో 80 సంవత్సరాల పూర్వం ఒక మహాతపస్వి ‘మందరం’ అనే పేరుతో రామాయణానికి ఒక బృహత్ వ్యాఖ్యను రచించిన గొప్ప రామభక్తులు అయిన శ్రీ వాసుదాసుగారి ప్రేరణతో ఒక రామాలయం నిర్మింపబడింది. అక్కడే ఆ తపస్వి ఆ గ్రంథాన్ని పూర్తి చేశారు. వారి నిర్యాణం తరువాత ఆ మందిర ప్రాంగణము సరైన ఆలనా పాలనా లేక శిథిలావస్థకు చేరినది. ప్రక్కనే ప్రభుత్వస్థలాన్ని ఆక్రమించి ఇళ్ళు కట్టుకున్న అన్య మతస్తులు ఆ స్థలాన్ని బహిర్భూమిగా వాడుకోవటం ప్రారంభించారు. ఈ విధంగా 35 ఏళ్ళు సాగిన తర్వాత శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు వారు దాని బాధ్యతలు స్వీకరించి శ్రీ కోదండ రామాలయాన్ని పునరుద్ధరణ చేసి, వసతులు ఏర్పాటు చేసి ఆ మందిరానికి పునర్వైభవం కలిగించి నిత్య ధూప, దీప, నైవేద్యాలను ఏర్పాటు చేశారు. ప్రక్కన ఒక చిన్న సాయి మందిరం కూడా నిర్మించారు.

ఆగస్టు 14వ తేదీన రామాలయ శిఖర కలశ ప్రతిష్ఠాపన -15వ తేదీన శ్రీ సాయిరామ విగ్రహ ప్రతిష్ఠాపన. ఆ సమయంలో ఆగస్టు నెల ‘విశ్వహిందు’ పత్రిక నాచేతికి వచ్చింది. దాంట్లో ఒక రచయిత వ్యాసంలో ద్వారకా పీఠంలో ప్రస్తుతం కూర్చున్న ఆచార్య - శ్రీ సాయిబాబా వారి గురించీ, సాయిభక్తుల గురించీ చేసిన అవకతవక విమర్శల గురించి చర్చించటం అనవసరం అని పేర్కొనబడింది.

ప్రస్తుతం హిందూ సమాజం ధర్మానికి జరుగుతున్న కీడు విషయంలో చాలా వరకు స్తబ్ధత పాటిస్తున్నది. దీన్ని అలుసుగా తీసుకొని విదేశీ మతాల వాళ్ళు ధర్మ నాశనానికి క్రమబద్ధంగా, ప్రణాళికాబద్ధంగా అనేక విధాలైన

దాడులకు పాల్పడుతున్నారు. ఉదాహరణకు కొందరు రచయితలను ప్రలోభపెట్టి జాతి గౌరవించే పురాణపాత్రలను భ్రష్టులుగా వ్రాయిస్తున్నారు. పతివ్రతలలో ఒకరుగా పేర్కొనబడిన ద్రౌపదిని కులట అని ఒకడు వ్రాస్తే అతనికి ప్రభుత్వంలో పెద్ద పదవులు, సభలలో సన్మానాలు. ఎలాంటి సన్మానం చెయ్యాలో తెలియక జాతి నోరెళ్లబెట్టుకొని చూస్తున్నది.

ఒక మహమ్మదీయుడు హిందూ స్త్రీని ఉంపుడుకత్తెగా పెట్టుకొని జాతిని అవమానించాడని నాటకం వ్రాస్తే ఆనందం పట్టలేక నాట్యం చేసి అవార్డులు ప్రదానం చేసింది. ఇదే పనిని హిందూ యువకుడు ముస్లిం స్త్రీతో చేసినట్లు వ్రాస్తే ఆ పుస్తకాల గతి ఏమయ్యేది? ఆ రచయితకు ఎలాంటి సన్మానం జరిగేది?

కాలజ్ఞానం వ్రాసిన యోగి పుంగవుడు శ్రీ పోతులూరి వీరబ్రహ్మంగారి గురించి అసంబద్ధంగా ఒకడు వ్రాస్తే ఆ పుస్తకాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక మహాసభలోనే ఆవిష్కరించటమా?

ధర్మాన్ని వ్యతిరేకించేవాళ్లకు నోబెల్ బహుమతులు, బుకర్‌ప్రైజులు, ధర్మ వ్యతిరేక పార్టీలు పెట్టిన వాళ్లకు రష్యా, చైనాల నుండి, అమెరికా, పాకిస్తాన్‌ల నుండి నిధులు అందుతున్నాయని ప్రకటమైంది. వాళ్లంతా సెక్యులరిస్టులనే పేరుతో ధర్మ ధ్వంసం చేస్తున్నారు. ఇది మనం చర్చించం.

తిరుపతి దేవస్థానానికి అత్యంత సమీపంలో అత్యంత పకడ్బందీగా జీహోదీలకు ఆవాసం ఏర్పాటు (వాళ్లంతా బురఖాలు వేసుకొని వస్తారట) చేసి దేవస్థానం మీద, హఠాత్తుగా దాడికి సంసిద్ధులౌతుంటే సమాజానికి పట్టడం లేదు. లోతులకు వెళ్లి పరిశోధించటం లేదు. స్వీయ ప్రయోజనాల కోసం ప్రచారాన్ని ఆశించే ఒకరిద్దరు సన్యాసులు తప్ప మిగతా ధర్మాచార్యులు ఈ ప్రమాదాన్ని పట్టించుకోవటం లేదు.

ఉత్తరాదిలో ఒక పెద్ద సంస్థ, పేరుకి యోగ వేదాంత ప్రచారమే. ప్రచారిణులు నన్స్ మాదిరిగానే వేషధారణ చేస్తారు. వాళ్లకు దాదాపు 100 విదేశాల నుండి నిధులు వస్తున్నాయని వాళ్లే చెప్తారు. హిందూ ధర్మానికి





మూలస్థంభమైన, మోక్షానికి మూలాధారమైన, "భగవంతుడు సర్వాంతర్యామి" అనే సిద్ధాంతమే తప్పని, దానిని నమ్మవద్దని ప్రచారం చేస్తూ ధర్మ వ్యతిరేకతను ప్రచారం చేస్తున్నారు. దక్షిణాదిలో ఒక పెద్దమనిషి ఒంటినిండా నగలతో ఉన్న భార్యతో తన ఫొటోలు పంచి విష్ణుమూర్తి యొక్క చివరి అవతారం నేనే అంటూ క్రైస్తవ దేశాల నుంచి అందుతున్న డ్రగ్స్‌ను తీర్థాలు, ప్రసాదాలు, లేహ్యాల ద్వారా యువతీ యువకులకు మప్పుతూ వారిని నిర్వీర్యులను చేస్తున్నారు. 'ఈనాడు' వంటి సామాజిక స్పృహ కలిగిన పత్రికలు ఈ విషయాలను పరిశోధించి ప్రచురించినా మనకు పట్టదు.

మన భారతదేశానికి ఒకవైపు హిమాలయాల వంటి అత్యంత ఉన్నతమైన పర్వతాలు, బంగాళాఖాతము వంటి అత్యంత లోతైన సముద్రాలు ఉన్నట్లే మన దేశంలో అత్యంతశ్రేష్ఠులైన త్యాగశీలురు, దేశభక్తులూ ఉండగా అత్యంత స్వార్థపరులూ, దేశద్రోహులూ ఉన్నారు. వీరిని ప్రలోభపెట్టి లోబరుచుకోవటం ధర్మద్వేషులైన విదేశీ ఏజెంట్లకు అత్యంత సులభం అలాంటి వారిని ఎక్కడికక్కడ ఎదిరించి బుద్ధి చెప్పకపోతే చిల్లికుండలో నీళ్లు నింపటానికి ప్రయత్నించినట్లే.

ఇంతకీ హఠాత్తుగా హిందూ సమాజంలో చీలిక తేవటానికి ప్రయత్నిస్తున్న యీ పెద్దమనిషి పూర్వాపరాలు ఏమిటి? ఒకప్పుడు మన గౌరవనీయమైన ప్రభుత్వం వారు ఇంతకుముందటి పోప్‌ను భారతదేశానికి సగౌరవంగా ఆహ్వానించారు. ఆయన మన దేశంలో వివిధ మతాధిపతులతో సమావేశం ఏర్పాటుచేసి ఒక ఉన్నతాసనం మీద కూర్చొని ఉపన్యసిస్తూ ఫలానా తేదీలోగా భారతదేశం మొత్తంలో శిలువ స్థాపిస్తాం అన్నారు. ఆ ప్రక్కనే ఒక మామూలు ఆసనంలో కూర్చున్న పెద్దమనిషి (సన్యాసి) దానిని విమర్శించకపోగా పోపును అభినందించారు. ఇది టీవిలో ప్రసారం అయ్యింది. ఆ సన్యాసి ఎవరో మర్చిపోయారా!

మొన్నటి కుంభమేళా కాక అంతకుమునుపు కుంభమేళాలో ప్రయాగలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధార్మిక సభ జరిగింది. దానిని బాయికాట్ చేస్తూ ఇటాలియన్ క్రైస్తవ వనితను ఆహ్వానించి, దగ్గరుండి సంగమ స్నానం చేయించి ఆమెను మహా పతివ్రతయైన సీతగా పేర్కొంటూ సీతామాతను అవమానించింది ఎవరో మర్చిపోయారా!

భారతదేశపు అదృష్టవశాత్తూ సమర్థుడు, అకలంక దేశభక్తుడు, ధర్మదీక్షాపరుడు, తెల్లబట్టల సన్యాసి, దేశాన్ని మళ్ళీ జగద్గురువు స్థానంలో నిలబెట్టడానికి ముందరికి వచ్చి వారణాసిలో ఎన్నికలలో పోటీకి నిలచిన ఆయనను గెలవకుండా చేసి మళ్ళీ విదేశీ రాజ్యమే వచ్చేటట్లు చేయటానికి పూనుకున్నది ఎవరో మర్చిపోయారా?

విదేశీ ఏజెంటుకు ఏజెంటుగా ఎన్ని కుట్రలు చేసినా ధర్మరాజ్యస్థాపనా, సమర్థమైన భారతీయ జనతా పార్టీ శ్రీయుత మోడీగారి నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

ఇప్పడీ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలి! ఇంతకుముందు మతహింస బిల్లు అనే పేరుతో ముస్లింలను రెచ్చగొట్టి హిందూ జాతిని అస్తవ్యస్తం చేసి ఓటు బ్యాంకు నిర్మాణం చేసుకోవడానికి ఇటాలియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రయత్నం చేసింది. అదృష్టవశాత్తూ అనేకమంది ముస్లింలలో దేశభక్తి ఉండటం వలన, ఆ వలలో పడలేదు. అందుచేత యిప్పుడు హిందువులు హిందువులే కొట్టుకొనేటట్లు చేసి అల్లకల్లోలం సృష్టించాలి. ఇదీ ప్రస్తుత ఎత్తుగడ. ప్రపంచమంతా అపర శంకరులుగా గౌరవించే ఆదిశంకరాచార్యులవారు హిందూ ధర్మ ఆచరణ, రక్షణ, ప్రచారాల కోసం దేశం నాలుగు వైపులా శంకర పీఠాలను స్థాపించి ఒక పటిష్ఠమైన ప్రణాళిక ఏర్పాటు చేశారు. ప్రతి హిందువు ధర్మము పట్ల అభిమానముతో యీ పీఠాలను గౌరవిస్తారు. ఆ పీఠాన్ని అధిరోహించిన వారు ఆదిశంకరుల





వారు ఆశించినట్లుగానే ప్రవర్తిస్తారని భావిస్తారు. విదేశీ ఏజెంట్లకు కోవర్టులుగా మారతారని ఊహించి వుండరు. తమ మతంలోకి రాకపోతే బ్రతికే అర్హత లేదంటూ చేసే ప్రచారమూ, ప్రార్థనా స్థలాలలోనే హిందువుల చేత పూజించబడే గోవులు అత్యంత కిరాతకంగా నరకబడటం యీయనకు పట్టలేదు. తమ మతంలోకి చేరకపోతే మీరు నరకానికి పోతారంటూ భయపెట్టి, ప్రలోభపెట్టి మతమార్పిడులు చేస్తూ క్రమక్రమంగా హిందువుల సంఖ్యను తగ్గిస్తూ, దేశద్రోహానికి, ధర్మనాశనానికి (ఒకడు మతం మారితే ఒక హిందువు తగ్గటం కాదు దేశానికి ఒక శత్రువు పెరుగుతున్నాడు-స్వామీ వివేకానంద) పాల్పడుతున్న విషయం యీయనకు పట్టలేదు. ఇంతకుముందు ఎన్నడూ లేనిది శ్రీయుత నరేంద్రమోడీ ప్రభుత్వం ఏర్పడగానే యీయనకు బాబా భక్తుల మీద ఎక్కడ లేని ద్వేషం పొడుచుకువచ్చింది. శ్రీరాముల వారిని, శ్రీకృష్ణులను ఆరాధించే వారు, పవిత్ర గంగాస్నానాలు చేసేవారు, అన్య మతస్తులలో కూడా ఉన్నారు. ఏ వ్యక్తినైనా శ్రీరాముణ్ణి కొలవవద్దనటానికి యీయన అర్హత ఏమిటి? ఏకం సత్ విప్రా బహుధా వదంతి అనీ. సర్వదేవ నమస్కారో కేశవం ప్రతి గచ్ఛతి అనీ హిందూ ధర్మం బోధిస్తుంది. దీన్ని అన్యమతస్థులు కూడా గ్రహించినప్పడు మనం సంతోషించాలి. అలాంటిది శ్రీ సాయిబాబా వారికి మసీదులు కాక, మందిరాలు కట్టి నిత్యం షోడశోపచార పూజలు చేస్తున్న వారు యీయనకు శత్రువులుగా కన్పిస్తున్నారా?

ఇటీవల ధర్మసంసద్ అనే పేరుతో కొందరు విభిన్నమైన అఖాడాల పెద్దలు స్వరూపానందగారి అధ్యక్షతన సమావేశమై మాంసాహారియైన సాయిబాబాను పూజిస్తారా అని విమర్శించారట. వీరి మెదడు ఎక్కడకు దిగజారిందో? అందరికీ ఆరాధ్య దైవాలైన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు మాంసాహారులైన క్షత్రియ కులంలోనే అవతరించారన్న సంగతి మామూలు మానవులకు కూడా తెలుసు. అవధూతలైన యోగులకు అశు

ధ్ధమైనా, బంగారమైనా సమానమే. అలాంటిది యోగీశ్వరేశ్వరుడు ఎలా ఉండాలో నిరూపించిన సాయిబాబా వారికి తినేదీ తానే తినబడేదీ తానే. ఈ స్థాయిని అర్థం చేసుకోలేని వారు అఖాడాలు నిర్వహిస్తున్నారట. నిజంగా ధర్మశాస్త్రాలు, యోగ వాశిష్ఠం వంటి వేదాంత గ్రంథాలు పఠించేవారు ఈ విధంగా మాట్లాడగలరా?

దేవుడనే పదానికి ఉర్దూలో అనువాదం అల్లా. తురక దేవుడు అంటూ వేరే ఎవ్వరూ లేరు. దేవుడు ఒక్కడే. హిందూధర్మంలో అన్ని అవతారాలను పూజించటం ఉన్నది. శ్రీకూర్మంలో పూజలందుకొంటున్నది ఎవరు? సింహాచలంలో పూజలందుకొంటున్నది ఎవరు? మనం కాలభైరవుడిని కూడా పూజిస్తాం.

ధార్మిక పీఠాన్ని అధిరోహించి ధర్మ వ్యతిరేక రాజకీయాలతో దేశద్రోహానికి పాల్పడుతున్న వారిని పదవుల నుండి దించివేసి ఆ పదవీ గౌరవాన్ని కాపాడే వ్యవస్థ కూడా ఏర్పడటం మంచిది. గౌరవనీయులైన, పూజనీయులైన మిగతా శంకర పీఠాధిపతులు యీ విషయం గురించి ఆలోచించ గలరని భావిస్తాము.

**ఇంతకీ ఈ సాయిబాబా ఎవరు?**

కొందరు భావించినట్లు విష్ణుమూర్తి మాత్రమే ధరించిన అవతారాలలో యిది ఉండదు.

కృష్ణ పరమాత్మ భగవద్గీతలో 'పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం, ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అన్నారు - దుర్మార్గుల్ని నశింపజేసి ధర్మస్థాపన చేస్తానన్నారు. దుర్మార్గుల సంఖ్య తక్కువగా ఉన్న కాలంలో - అంటే ద్వాపరయుగం వరకు యిది సాధ్యమే. కాని వారి సంఖ్య అసంఖ్యాకంగా పెరిగిపోయిన యీ కాలంలో సంహరణ కార్యం ప్రారంభిస్తే మిగిలేది ఎంతమంది. అంచేత కరుణామయుడైన ఆ పరమాత్మ సంహారకార్యం కాక సంస్కారకార్యం- అంటే మనుష్యులలో దుర్మార్గ గుణాలను తొలగించి సన్మార్గులుగా మార్చటం చేపట్టారు.





దీనికోసం సృష్టి, స్థితి, లయకారులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురూ ఒక్కటైన దత్తాత్రేయ అవతారాన్ని త్రిమూర్తుల సమాహార స్వరూపాన్ని ధరించారు.

సృష్టి యావత్తు ఆయన సంతానమే. అందునా ఎక్కువగా చెడిపోయిన వారి మీద ఎక్కువ శ్రద్ధ చూపించాల్సి ఉంటుంది. ప్రేమతో, లాలనతో వారిని దగ్గరకు చేరదీసి సుబోధలతో సంస్కరించాల్సి ఉంటుంది. హిందూ సాధువు రూపంలోనో (పండిత శ్రద్ధానందుల వారి హత్యోదంతం జ్ఞాపకం ఉండే ఉంటుంది) శ్రీరామ, శ్రీకృష్ణుల వంటి రాచరికపు రూపాల్లోనో ప్రకటమౌతే ఇతర మతస్థులు దగ్గరకు రారు. అంచేత వాళ్ళు గౌరవించే ఫకీరు వేషధారణతో ఒక పాడుపడిన మసీదును ఆవాసంగా చేసుకున్నారు. కాని దానికి కృష్ణుని నగరమైన ద్వారకను తలపింపజేస్తూ, తానే ఆనాటి గీతాచార్యుడనని అవగాహన కల్పిస్తూ 'ద్వారకామాయి' అని నామకరణం చేశారు. అన్యమతస్థులకు అయిష్టమైనా, గుడులలో మాత్రమే పెంచే తులసీ బృందావనాన్ని పెంచారు. ఆ మసీదు ఆకారంలో ఉన్న నిర్మాణంలో నిత్యమూ దీపాలు వెలిగించారు. షోడశోపచార పూజలు చేయించారు. నాలుగు వేళలా హారతులు స్వీకరించారు. అన్యమతస్థుల చేత వారి మతగ్రంథంలోని మంచి విషయాలను పఠింపజేశారు. భారీగా దక్షిణ యిస్తారని భావించిన వేదపండితులు వీరి శస్త్రధారణ చూసి ముస్లింగా భావించి, ఈయనకేమి తెలుసులే అని అహంకారంతో పారాయణ చేయబోతే ఎంతో అలవాటైన పారాయణలోనే తప్పులు దొర్లినై. సాయిబాబా వారు ఆ వేదబుక్కులను సరిదిద్దారు.

ప్రతి భక్తుడికీ వారి వారి ఇష్టదైవాల రూపాలలో రాముడుగా, కృష్ణుడుగా, పాండురంగడుగా, హనుమంతునిగా, దత్తాత్రేయునిగా చివరకు సద్గురువుల శిష్యులకు వారి వారి సద్గురువుల రూపాలలో దర్శనమిచ్చారు. షిరిడీలోని ప్రాచీన దేవాలయాలను పునరుద్ధరించి ధూపదీపాది అర్చన

లను ఏర్పాటు చేయించారు. కొందరు భక్తులకు - ఆ దేవాలయాల దర్శన మైన తరువాతనే తమ దర్శనం యిచ్చేవారు. దేవాలయాలను అగౌరవ పరచనిచ్చేవారు కారు.

చిన్నచిన్న కథల రూపంలోనూ, సంఘటనల రూపంలోనూ ధర్మబోధ చేసేవారు. హైందవ ధర్మాచారాలను పాటింప జేసేవారు. ప్రతిరోజూ ఐదు ఇళ్లకు భిక్షకు వెళ్లి-ప్రతి గృహస్థూ తప్పనిసరిగా చేసే ఐదు పాపాలు (పంచ సూనములు) పోగొట్టటానికి పంచయజ్ఞాలలో ఒకటైన అతిథియజ్ఞాన్ని చేయించి వారి పాపాలను తాము స్వీకరించేవారు.

భక్తులు తమ దగ్గరకు రాగానే వారిలో త్యాగగుణాన్ని పెంచటానికి దక్షిణ అడిగి తీసుకునేవారు. దానిని సాయంత్రానికల్లా అవసరంలో ఉన్న వారికి పంచివేసి, తానూ, తన చినిగిన కఫనీ, కూర్చున్న గోనెపట్టా మిగిలేవారు.

ఆకలితో ఉన్న వాడికి భగవంతుడు రొట్టెముక్కలో కన్పిస్తాడని స్వామి వివేకానంద అన్నట్లుగా సాయిబాబావారు తమ దగ్గరకు వచ్చిన వారి మంచి కోరికలను నెరవేర్చేవారు. కష్టాలు తొలగించేవారు. నెమ్మదిగా వారి మనస్సుల్లో సంస్కారాలు నింపేవారు.

బాబా వారి కీర్తి విని ఒక పఠాను తమ్మునితోసహా షిరిడీ వచ్చాడు. మసీదుగా భావించిన దాంట్లో బాబావారు నిత్యం పూజలు చేయించటం చూశాడు. బాబా వల్లనే మసీదు భ్రష్టుపడుతున్నదని భావించి ఆయననే తుదముట్టించాలని ఒక దుడ్డుకఱ్ఱ పట్టుకొని సమయం కోసం ఎదురుచూస్తున్నాడు. సర్వాంతర్యామి, సర్వజ్ఞుడు అయిన బాబా-కావాలని ఒంటరిగా ఒక సందులోకి ప్రవేశించారు. అవకాశం దొరికింది గదా అని ఆ పఠాను వెనకాలగా వెళ్లి దుడ్డు కర్రతో తలమీద మోదబోయాడు. బాబావారు హఠాత్తుగా వెనక్కు తిరిగి చిన్న స్పర్శతో ఆ బలశాలిని స్థబ్ధుడిని చేశారు. ఆ తరువాత కరుణతో అతనికి స్వస్థత నిచ్చి వెళ్లిపొమ్మన్నారు.





ఒక గోవు (ధేనువు కాదు వృషభము) దుర్మార్గంగా ఒక కసాయివానికి అమ్మబడితే బాబావారు ఒక భక్తుని కలలో కన్పించి దానిని విడిపింపజేశారు.

బాబా ప్రక్కన కూర్చుండే బడేబాబా అనే ఆయన ఒక హిందూ యువకుని మతంమార్చి తెచ్చి బాబా ముందు నిలబెట్టాడు. బాబా ఆ యువకుని లాగి లెంపకాయలు కొట్టి “నీ యబ్బను మార్చుకుంటావురా” అన్నారు. ఇది మతమార్పుల గురించి బాబా బోధ. బ్రహ్మజ్ఞానం కోసం వచ్చిన ఒక భక్తుని దృష్టిలో పెట్టుకొని వేదాంతసారమంతా బోధించారు. నానాసాహెబ్ చందోర్కర్ అనే సంస్కృత పండితుడైన డిప్యూటీ కలెక్టరు బాబా పాదాలు నొక్కుతూ భగవద్గీతలోని “తద్విద్ధి ప్రణిపాతేన...” అనే శ్లోకాన్ని గొణుక్కుంటూ ఉంటే దాని ప్రతిపదార్థాన్ని చెప్పమని అతడు సక్రమంగా చెప్పలేకపోతే తాము చక్కని వ్యాఖ్యను చెప్పి-చివరలో గురువు శిష్యునకు బోధించేది జ్ఞానము కాదని (కారణం అతడు స్వతహాగా జ్ఞానమూర్తియే) దీపానికి పట్టిన మసిలాగా అతనిని ఆవరించిన అజ్ఞానము ఇది - దాన్ని తొలగించుకోమని చెబుతారని శంకరాచార్యుల వారు చెప్పని క్రొత్త అర్థాన్ని వివరించారు. ఇతర మతస్థులు విజ్ఞానం, పునర్జన్మల పరిజ్ఞానం వరకు వెళ్లలేదు కాని ఆ పాడుబడ్డ మసీదులో ఫకీరు వేషంలో కూర్చున్న బాబావారు పునర్జన్మల గురించి అనేక సంఘటనలను (హిందూ ధర్మానికే తెలిసిన) రెండు మేకల వృత్తాంతంలో, ఒక భక్తురాలి గత మూడు జన్మల గురించి, ధన వ్యామోహం వలన ఎలాంటి జన్మ పరంపర ఏర్పడుతుంది - చెన్నబసప్ప, వీరభద్రప్పల గురించి వివరించటమేగాక, తన ప్రియభక్తుడైన శ్యామాతో అతడు 72 జన్మల నుండి తమతో ఉన్నాడని చెప్పారు. ఒక భక్తురాలికి స్వయంగా “రాజారాం” అనే మంత్రం ఉపదేశించారు.

నీకూ నాకూ మధ్య ఉన్న అడ్డు తొలగించు-మనిద్దరకు భేదమే లేదనీ

మనకు కన్పించే చరాచర సృష్టిలో నామమూ, రూపమూ తొలగిస్తే

మిగిలేది చైతన్యమేననీ - అందరిలో ఉన్నది ఆ చైతన్యమేననీ దాన్ని చూడ గలిగితే పరమాత్మ దర్శనమైనట్లేననీ మోక్షమార్గం వివరించారు.

నీ భారములు నా మీద వేయుము నేను మోస్తాను అని భక్తి యోగము, ఏ పనిచేస్తున్నా నన్ను స్మరించు అని ధ్యాన యోగము. సర్వజీవ రాశుల్లో నన్ను చూచి సేవించు అని కర్మయోగము. నీవెక్కడ ఉన్నా నీ వెంట, నీలోను సర్వజీవరాశుల్లోనూ ఉన్నది నేనే అని జ్ఞాన యోగమూ కలిపి సముచ్చయ యోగాన్ని-అదే భగవద్గీతను అభ్యాసం చేయించిన దత్తాత్రేయ అవతారం శ్రీ సాయిబాబా.

నీవు పిలిచిన తక్షణం నీవెంట ఉంటానని వాగ్దానం చేసి ఆ విధంగా ప్రపంచవ్యాప్తంగా కోటానుకోట్ల మందిని అనుగ్రహిస్తున్న శ్రీ సాయిబాబా వారు హిందూ ధర్మరక్షకులు.

ధర్మద్రోహులను నశింపజెయ్యటం మన వలన కాదు. శుంభ నిశుంభుల మాదిరిగా వారిలోవారే కలహించి నశించి పోతారేమో కాని మనం సాయిబాబా వారి బోధలననుసరించి ప్రేమతో వారిని సంస్కరించటానికి ప్రయత్నించటం మంచిది. దానికి మన సమైక్యత, సమర్థత పెరగటం అవసరం. హిందూధర్మం అనుసరించే అందరూ ఒక్క త్రాటి మీదికి వచ్చి బలీయమైన సుసంఘటన ఏర్పడాలి. బలముపాస్య- బలము పాస్య. దీనికి తపస్వి, త్యాగశీలి, నిరహంకారి, అకలంక దేశభక్తుడూ, నలుగురినీ కూడగట్టుకుపోగల సమర్థుడూ అయిన ధర్మాచారి బాధ్యత స్వీకరించాలి.

*ఓం శ్రీ సచ్చిదానంద సమర్థ సద్గురు సాయినాథ మహరాజ్‌కీ జై*

సాయిదత్త పీఠాధిపతులు

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

అధ్యక్షులు : సనాతన ధర్మ పరిరక్షణ సమితి
భారత స్వాభిమాన యాత్రా యోజన





# మాతృసంస్థ కబుర్లు

భారీ వర్షాల వల్ల వాగులు, నదులు, చెరువులు పొంగి పొర్లటం వలన విజయవాడ ప్రకాశం బ్యారేజీ 70 గేట్లు ఒక్కసారిగా ఎత్తటం వల్ల 11 లక్షల పైచిలుకు క్యూసెక్కుల నీరు దిగువకు ఒక్కసారి రావటం వల్ల కృష్ణనది చేరువలో ఉన్న మన సాయినాథ క్షేత్రం ఆశ్రమంలోకి నీరు భారీగా వచ్చే అవకాశం ఉంది అని ముందే గ్రహించిన మైనేని వారి పాలెం గ్రామ భక్తులు స్వామీజీ గార్కి ఫోన్ ద్వారా సమాచారం అందించటం స్వామీజీ వెంటనే అక్కడే నివాసం ఉంటున్న పూజారి కుటుంబసభ్యులను, వారి సామాగ్రిని భద్రమైన ప్రదేశంలో ఉంచమని సూచన చేస్తూనే గ్రామ భక్తులైన దుర్గారావు, శ్రీను, సామ్రాజ్యం, సుబ్బారావు, లుక్కా నాగమల్లేశ్వర రావుగార్లకు ఫోన్లు చేయటంతో వారంతా ఉరుకులు, పరుగులతో ఆశ్రమం చేరుకొని సామాగ్రిని సాయి దేవాలయంలోకి కొంత, మిగతా సామాగ్రిని గురుదేవులు ముందుచూపుతో నిర్మాణం చేయించిన అటకల మీదికి చేర్చటం జరిగింది. విద్యుత్ సరఫరా నిలిపివేశారు. గంటగంటకు వరద ఉధృతి పెరగటం మొదలైయ్యింది. రాత్రి గం.10ల నుండి 12 గం.ల లోపల ఆశ్రమంలోకి కృష్ణమ్మ పరుగులు పెడుతూ వచ్చింది. ఉదయం కల్లా 3 అడుగులు ఉన్న నీరు సాయంత్రానికి 7 అడుగులకు చేరింది. లంక గ్రామాలు పూర్తిగా నీట మునిగిన వార్తలు వస్తున్నాయి. పొలాల్లో నాట్లు, కూరగాయలు వేసి మరికొద్ది రోజుల్లో కూరగాయలు చేతికి వస్తాయి అనుకుంటున్న సందర్భంలో పూర్తిగా మునిగిపోవటంతో తీవ్రమైన వేదనతో రోదిస్తున్న రైతులు ఒకప్రక్క అయితే, ఇళ్లల్లోకి నీరు చేరి సామాను ఆహార వస్తువులు నీట మునిగిపోవటంతో కట్టుబట్టలతో బరువెక్కిన గుండెతో

కరకట్ట మీదికి వచ్చి నిశ్చేష్టులై నిలబడి కృష్ణమ్మ తల్లిని శాంతించమని ప్రార్థన చేస్తున్న ప్రజలను చూస్తుంటే మనస్సు విచారంతో మునిగి పోయింది. ఆశ్రమ పూజారి పడవలో వెళ్లి బాబాకు, పూజ, నైవేద్యం, హారతులు ఇచ్చి రావటం జరిగింది. తెనాలి నుండి శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్ సభ్యులైన శ్రీ బూర్లగడ్డ గోపీకృష్ణగారు వచ్చి వరద ఉధృతిని గమనిస్తూ ఆశ్రమ భక్తులతో ఆశ్రమ పరిస్థితి గురించి చర్చించి వెళ్లారు. ప్రవాహ వేగం పెరుగుతూనే ఉంది. కరకట్ట ఎత్తుకు చేరుతుంది. కృష్ణమ్మకట్ట ఎక్కితే గ్రామాలు పూర్తిగా ధ్వంసం అయ్యే పరిస్థితి ప్రభుత్వం వారు వీక్‌గా ఉన్న చోట ఇసుక బస్తాలతో మరమ్మత్తులు చేస్తున్నారు. లక్షల మంది పూజలు, కోట్ల మంది ప్రార్థనలు, బ్రాహ్మణోత్తముల జపాలు మహనీయులైన విన్న పాలు ఆలకించినట్లుగా కృష్ణమ్మ తల్లి ఉగ్రరూపాన్ని ఉపసంహరించినట్లుగా వరద ఉధృతి తగ్గటం మొదలైయింది. అందరూ ఊపిరిపీల్చుకున్నారు. మరునాడు నీరు అంతా పోయిన తరువాత ఆశ్రమ భక్త బృందం స్వచ్ఛందంగా ఆశ్రమం భవనాల నిండా పేరుకుపోయిన బురదను, కొట్టుకువచ్చిన చెత్తను తొలగించే పనులు చేపట్టారు. సాయంత్రానికి పూర్తిగా కడగటం పని పూర్తయింది. ఆ మరుసటి రోజున స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారు, ఆశ్రమ సేవకుడైన శ్రీనివాస్‌తో శ్రీ సాయినాథ క్షేత్ర ఆశ్రమం సందర్శించి, ఆశ్రమం అంతా పరిశీలించారు. కామరాజు గడ్డ ప్రెసిడెంట్‌గారి సహకారంతో ఆశ్రమం అంతా సున్నం, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మరునాటికి విద్యుత్‌ను పునరుద్ధరింపజేశారు. వరదధాటికి ఆశ్రమానికి కొంత ఆస్తి నష్టం వాటిల్లింది. గోడలు కుంగిపోవటం వల్ల భారీగా పగుళ్లు ఏర్పడ్డాయి. గురుదేవుల రక్షాహస్తం, సాయినాథుని చల్లని చూపు వల్ల కష్టం నుండి గట్టెక్కగల్గింది ఆశ్రమం.

ఆగస్టు 21వ తేదీన సాయిధామం సేవాశ్రమ వ్యవస్థాపక సభ్యులలో





ఒకరైన శ్రీ మాతా శుకవాణి మాతాజీగారు పరమపదించి 8 సం.లు గడచిన సందర్భంగా సాయిధామం అనుబంధ శాఖలలో మాతాజీ గార్కి పూజా కార్యక్రమం నిర్వహించి, వారు చేసిన సేవలను స్మరిస్తూ వారికి నివాళులు అర్పించారు ఆశ్రమవాసులు. సాయిధామం సేవాశ్రమంలో పూజ్య మాతాజీ పాలరాతి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూజా కార్యక్రమం చేసిన పిదప స్వామీ శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు మాతాజీ జీవించిన విధానం, ఆశ్రమం పట్ల వారికున్న సేవా నిరతి, ఆమె వాక్కు ద్వారా ఆకట్టుకొనే విధానం గురుదేవుల పట్ల వారికున్న భక్తి విశ్వాసాలు వారు ఎంచుకొన్న సేవా విధానం, వారు నిర్యాణ సమయంలో చెప్పిన మాటలు మొదలగు విషయాలను స్వామీజీ గుర్తు చేస్తూ కన్నీటి పర్యంతం అయినారు. అనంతరం భక్తులు, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు అమ్మకు నివాళులు అర్పించారు. భక్తులకు అన్నప్రసాదం, పాఠశాల విద్యార్థులకు స్వీటు, పులిహోర (200 మందికి) ప్రసాదం ఆశ్రమ పక్షాన అందించటం జరిగింది.

## శ్రద్ధాంజలి

సాయిధామం సేవాశ్రమానికి మొదటి వానప్రస్థులుగా ఆశ్రమ ప్రవేశం చేసి సేవా మార్గంలో నడుస్తూ, శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యులలో ఒకరైన శ్రీ మండా సత్యనారాయణ గారు అలియాస్ శ్రీ ఆనందం గారు సెప్టెంబర్ 10 మంగళవారం ఉదయం గం.6.00 లకు పరమపదించారు. వారి ఆత్మకు శాంతి కలగాలని సాయివాణీ మనసారా ప్రార్థన చేస్తుంది.